## మాస్‌కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలి



ఎల్లారెడ్డి పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

ఎల్లారెడ్డి రూరల్, మే 27 : విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడకుండా పరీక్షా కేంద్రాల్లో తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాజేశ్‌చంద్ర సిబ్బందికి సూచించారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. సెంటర్‌లో ఎంత మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారనే వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలించారు. అనంతరం ఆయన పరీక్ష సెంటర్ సీఎస్ నిజామొద్దీన్, సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ తదితరులున్నారు.

**పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ..**

పెద్దకొడప్‌గల్, మే 27 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రాజేశ్ చంద్ర మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, రిసెప్షన్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. ఎస్సై మహేందర్‌తోపాటు సింబ్బందిని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ విఠల్ రెడ్డి, సీఐ నరేశ్, ఎస్సై మహేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ నిరుద్యోగ కళాకారిణికి నివాళి



నిరుద్యోగ కళాకారిణి స్వప్నకు నివాళులర్పిస్తున్న జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం ప్రతినిధులు

కామారెడ్డి, మే 27 : ఇటీవల పాలమూరుకు చెందిన ఉద్యమ నిరుద్యోగ కళాకారిణి నట్టల స్వప్న మృతి చెందింది. ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కళాకారులకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నిరుద్యోగ కళాకారుల సంఘం ప్రతినిధులు సొంటెం సాయిలు యాదవ్, వడ్ల వెంకన్న, దేవరాజ్, ఎల్లయ్య యాదవ్, రాజలింగం యాదవ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ తీగలు ఎత్తుకెళ్తున్న దొంగలు
- బాన్సువాడ మండలంలో పెరిగిన ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు

బాన్సువాడ రూరల్, మే 27 : బాన్సువాడ మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేసి అందులోని విలువైన కాపర్ తీగను ఎత్తుకెళ్తున్నారు. కొన్ని నెలలుగా మండలంలో జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి. దుండగులు పక్కా ప్లాన్‌తో కరెంట్ సరఫరా నిలిపేసి కాపర్‌ను చోరీ చేస్తున్నారు. పగలు రెక్కీ నిర్వహించి.. ఎక్కడెక్కడ చోరీకి అనుకూలంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయో గుర్తించి అర్ధరాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నారు. ఇందంతా ప్రొఫెషనల్ దొంగల పనేనని విద్యుత్ సరఫరా, కనెక్షన్స్‌పై పూర్తిగా అవగాహన ఉన్నవారే చోరీలకు పాల్పడుతున్నారనే అనుమానాలను ట్రాన్స్‌కో అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంతో విద్యుత్‌శాఖకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు.

**పక్కా ప్రణాళికతో చోరీలు..**

మండలంలో జరుగుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం, కాపర్ తీగ చోరీలు పక్కా ప్రణాళికతో జరుగుతున్నాయి. మండలంలోని బోర్లం గ్రామంలో మూడు, బోర్లం క్యాంపులో ఒకటి, తిర్మలాపూర్, హన్మాజీపేట్, మొగులాన్‌పల్లి గ్రామాల్లో ఒకటి చొప్పున ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని విలువైన కాపర్ తీగను దొంగలు ఎత్తుకెళ్లారు. తరుచూ దొంగతనాలు జరుగుతుండడంపై విద్యుత్ సరఫరాలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుండగులు ఊరికి దూరంగా ఉన్న పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. తరుచూ జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి.



బోర్లం క్యాంపులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ తీగను ఎత్తుకెళ్లిన దొంగలు

### రైతులకు తప్పని తిప్పలు



ఇటీవలే మా గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగితీగను దుండగులు ఎత్తుకెళ్లారు. బోర్లపై ఆధారపడే రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బాన్సువాడ మండలంలో జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం ఘటనలు రైతును ఆందోళనకు గురి చేస్తున్నది. పోలీసులు నిఘా పెట్టి, నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలి.

– సాయిలు యాదవ్, రైతు, ఇబ్రహీంపేట్

### రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

కొన్ని రోజులుగా మండలంలో జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ తీగ చోరీలు ఆందోళన కలిగిస్తున్నాయి. విద్యుత్‌శాఖకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లుతున్నది. రైతులకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే చోరీ చేసిన ఏడు చోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి రైతులకు విద్యుత్ కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం. దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనుమానిత వ్యక్తులు సంచరిస్తే రైతులు పోలీసులకు సమాచారం అందించాలి.

- సంతోష్‌కుమార్, ఏఈ, బాన్సువాడ

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

పెద్దకొడప్‌గల్(పిట్లం), మే 27 : పేకాట స్థావరాలపై పోలీసు లు దాడిచేసిన ఘటన గోద్మెగాం గ్రామ శివారులో చోటు చేకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పిట్లం మండలం లోని గోద్మెగాం గ్రామ శివారులో పేకాడుతున్నారని పక్కా సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం 6.45 గంటల సమయంలో పేకాట స్థావరాలపై దాడి చేసినట్లు చెప్పారు. పేకాడుతున్న ఏడుగురిని పట్టుకొని కేసు నమోదు చేసి వారి నుంచి రూ.12,090లు, ఐదు బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

## రమాబాయి అంబేద్కర్ వర్ధంతి

బాన్సువాడ రూరల్, మే 27 : బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం సభ్యులు అనిల్, లక్ష్మణ్, సాయిలు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## పంట రుణాల రెన్యువల్‌లో రైతులు బిజీ బిజీ



బాన్సువాడలో రైతులతో కిటకిటలాడుతున్న యూనియన్ బ్యాంక్

బాన్సువాడ, మే 27 : పంట రుణాలను రెన్యూవల్ చేసుకొనే పనిలో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, నిజాంసాగర్, మహ్మద్ నగర్, గండివేట్, బిచ్కుంద, పిట్లం, పెద్దకొడప్‌గల్ తదితర మండలాల్లో యాసంగి పంటలు ముగిశాయి. పంట డబ్బులను బ్యాంకుల్లో దాచుకున్న రైతులు వారివారి పంట రుణాలను రెన్యువల్ చేసుకొనే పనిలో నిమగ్నమయ్యారు. గత వానకాలంలో పంట రుణం తీసుకున్న రైతులు వడ్డీతో చెల్లించి, కొత్త రుణం పొందేందుకు బ్యాంకులకు క్యూ కట్టారు. మరోవైపు బ్యాంకుల్లో మహిళా సంఘాల రుణాల చెల్లింపులు, పంట డబ్బులను డ్రా చేసుకొని రైతులతో బ్యాంకులు కిటకిటలాడుతున్నాయి.

## యుద్ధంలో పాలుపంచుకోవడం గర్వకారణం



పోసానిపల్లికి చెందిన ఆర్మీ జవాను పోతుగంటి సురేశ్‌ను సన్మానిస్తున్న యువ నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, మే 27 : దేశ సరిహద్దులో మీరు ధైర్యంగా యుద్ధం చేయడం మాకు గర్వంగా ఉందని స్థానిక నాయకులు ఆర్మీ జవాన్‌కు జేజేలు పలికారు. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని పోసానిపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి సురేశ్‌ను, మండలంలోని హాజీపూర్ కట్టకిందితండాకు చెందిన మాలోత్ రంజిత్‌ను వారు మంగళవారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఇద్దరు జవాన్లు కూడా జమ్ము కాశ్మీర్‌లోని జైరైన్ రాజోరి, పూంచ్ సరిహద్దు ప్రాంతాల్లో విధులు నిర్వహించడం ఎంతో గర్వంగా ఉన్నదన్నారు. ఇద్దరు జవాన్లకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నరేశ్, కుచులకంటి శంకర్, రాములు, పరంధాములు, కిషన్ తదితరులున్నారు.

## అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న టీజీవీపీ నాయకులు

కామారెడ్డి, మే 27 : జిల్లా కేంద్రంలో నారాయణ పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని టీజీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పాఠశాల ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్ మాట్లాడుతూ.. నారాయణ పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని, ఆ పాఠశాల వారు విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అడ్మిషన్స్ తీసుకుంటున్నారని తెలిపారు. ఈ విషయమై పాఠశాల యాజమాన్యాన్ని అడిగితే మాకు పర్మిషన్ లేదు, ఏమి చేసుకుంటారో చేసుకోండని దురుసుగా మాట్లాడుతున్నారని అన్నారు. దీనిపై డీఈవోకు ఫోన్ చేస్తే నారాయణ పాఠశాలకు పర్మిషన్ లేదని, ఇప్పటికే ప్రపోజల్ కూడా పెట్టలేదని అన్నారు. ఈ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి సమీర్, రాజేందర్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్‌లో కొనసాగుతున్న ఆడిట్



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

బాన్సువాడ, మే 27 : బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాయలంలో ఐదు రోజుల క్రితం ప్రారంభమైన ఆడిట్ కొనసాగుతున్నది. మంగళవారం కార్యాలయంలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు జరిగిన అన్ని పనుల వివరాలు, మున్సిపల్ ఆదాయ, వ్యయాలపై అధికారులు రికార్డులను పరిశీలిస్తున్నారు. వచ్చే నెల 15 వరకు మున్సిపల్ కార్యాలయంలో ఆడిట్ కొనసాగుతుందని ఆడిట్ అధికారులు రాములు, అబ్జలొద్దీన్, దేవరాజ్, సారిక, రాజ్‌సాబ్ తెలిపారు. పూర్తి వివరాలను ఆడిట్ పూర్తయిన వెంటనే వివరిస్తామని చెప్పారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

రామారెడ్డి(సదాశివనగర్), మే 27 : సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామానికి చెందిన మహిళ పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సదాశివనగర్ ఎస్సై రంజిత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సింపల్లీ సాయవ్వ (42) ఐదేండ్ల క్రితం నడుముకు దెబ్బ తగిలి శస్త్ర చికిత్స చేయించుకున్నది. కానీ దిన, దినం ఆరోగ్యం క్షీణించింది. నెల రోజుల క్రితం మోటర్ సైకిల్ పైనుంచి పడి చేయి విరిగి, మంచం పాలైంది. ఏం చేయలేక పోతున్నాన బాధతో మనస్తాపం చెంది 24వ తేదీన తెల్లవారు జామున 3 గంటలకు సొంత ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగింది. భర్త మల్లయ్య కొట్టం నుంచి ఇంటికి వచ్చి చూచి వెంటనే ఆటోలో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేట్ ఆశ్వీని దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందింది. భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి..

భిక్కనూరు, మే 27 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట్‌కు చెందిన అన్వర్(46) భిక్కనూరులో సైకిల్ టేక్స్ నిర్వహిస్తాడు. కాగా ఎప్పటిలాగే తన పని ముగించుకొని సోమవారం రాత్రి భిక్కనూరులోని తన తమ్ముడి ఇంటికి సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో భిక్కనూరు చర్చి ఎంట్రెన్స్ వద్ద లారీ ఢీకొట్టగా అతడికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుంగా మర్గమధ్యలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## దొంగతనాల నివారణకు చర్యలు

నిజాంసాగర్, మే 27 : మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరుగుతున్నందున నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ విద్యుత్ సంస్థ వారితో కలిసి అచ్చంపేట గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఓపెన్ చేయడానికి వీలులేకుండా వెల్డింగ్ చేయించారు. ఇదే మాదిరిగా అన్ని గ్రామాల రైతులకు తమ పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ సిబ్బందితో కలిసి వెల్డింగ్ చేయించుకోవాలని సూచించారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు అరికట్టవచ్చని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, లైన్‌మన్ షేరు తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్, నస్రుల్లాబాద్‌లో భారీ వర్షం



బీర్కూర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

నస్రుల్లాబాద్, మే 27 : బీర్కూర్, నస్రుల్లాబాద్ మండల కేంద్రాలతోపాటు మైలారం, బొమ్మన్‌దేవ్‌పల్లి తదితర గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. డ్రైనేజీలు, రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. బీర్కూర్‌లో మార్కెట్ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్షానికి రోడ్లపై నీరు నిలిచిపోవడంతో కూరగాయలు కొట్టుకుపోయాయి.

## ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ

నాగిరెడ్డిపేట, మే 27 : నిరుపేదలకు అందిస్తున్న గృహ నిర్మాణ పథకంలోని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు తెలిపారు. మండలంలోని వదలపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎంపికైన ఇండ్లకు మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాల్తుమ్మెద విండో మాజీ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, నాయకులు బాల్‌చందర్‌గౌడ్, రాజేశ్వర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

బిచ్కుంద, మే 27 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు. బిచ్కుంద మండలంలోని పుల్కల్, హస్గుల్ మంజీరా పారీవాహక ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను మంగళవారం రెవెన్యు అధికారుల పట్టుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలు అతిక్రమించి అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక అవసరమైన వారు తహసీల్ కార్యాలయంలో నేరుగా సంప్రదించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు పొందవచ్చన్నారు.

## చెరువు తూముకు మరమ్మతులు



దొంతిరెడ్డి చెరువు తూమును బాగు చేసుకుంటున్న రైతులు

బాన్సువాడ రూరల్, మే 27 : బాన్సువాడ మండలంలోని కొల్లూరు గ్రామంలోని దొంతిరెడ్డి చెరువు తూమును మంగళవారం చెరువు ఆయకట్టు రైతులు మరమ్మతు చేసుకున్నారు. వానకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులు చెరువు తూము నుంచి నీరు లీక్ కాకుండా మరమ్మతులు చేశారు. నారు మళ్లను సిద్ధం చేసుకొని వానకాలం పంటల సాగుకు సమాయత్తం అవుతున్నామని రైతులు తెలిపారు. చెరువు తూము నుంచి నీరు వృథా పోకుండా కావాల్సిన మరమ్మతులు రైతులందరం కలిసి చేసుకుంటున్నామని ఆయకట్టు రైతులు తెలిపారు

## తాగునీటి సమస్య పరిష్కరించండి



గ్రామ పంచాయతీ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న 15వ వార్డు ప్రజలు

బిచ్కుంద, మే 27 : మండల కేంద్రంలోని 15వ వార్డు సభ్యులు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిందెడు నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. నిత్యకృత్యాలు తీర్చుకోవడానికి మినరల్ వాటర్ కొనాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించు కోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో రెండు నెలలుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీకి తరలి వెళ్లారు. కార్యదర్శి అందుబాటులో లేక పోవడంతో పంచాయతీ అధికారులకు నీటి సమస్య తీర్చండంటూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నల్లాలు ఎప్పుడు వస్తాయోనని పనులు మానుకొని ఇంటి వద్దే ఉండాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో బోర్లు కొన్నిరోజులుగా పాడైపోయాయని, మిషన్ భగీరథ నీళ్లు కూడా రాకపోవడంతో నిత్య కృత్యాలు తీర్చుకోవడానికి మినరల్ వాటర్ కొనాల్సి వస్తుందన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలని కోరారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

బాన్సువాడ/బిచ్కుంద/రాజంపేట్, మే 27 : నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని బాన్సువాడ వ్యవసాయ శాఖ డివిజన్ అధికారిణి అరుణ ఫర్టిలైజర్ దుకాణ యాజమానులను హెచ్చరించారు. బాన్సువాడ పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను పోలీస్ శాఖ అధికారుల సమన్వయంతో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో విక్రయిస్తున్న విత్తనాలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. విత్తన బస్తాలు, రిజిష్టర్లను తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులను ఎక్కువ ధరకు విక్రహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా విత్తనాలను విక్రయించే వారి వివరాలను అందించాలని తెలిపారు. నాసిరకమైన విత్తనాలను విక్రయిస్తే డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట రూరల్ సీఐ రాజేశ్, ఆయా దుకాణాల యజమానులు అరుణ్, వినయ్‌గుప్తా, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు. బిచ్కుందలో విత్తన, ఎరువుల దుకాణలను ఏడీఏ అమినాబీ, ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్, ఎస్సై మోహన్‌రెడ్డి టాస్క్‌ఫోర్స్ బృందంగా ఏర్పడి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో విత్తనాలు, పురుగు మందులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ, పోలీస్ శాఖ సిబ్బంది, దుకాణదారులు పాల్గొన్నారు. రాజంపేట మండలంలోని పలు విత్తన దుకాణాలను ఏవో శ్రుతి తనిఖీ చేశారు.




బాన్సువాడలో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారిణి అరుణ, రూరల్ సీఐ రాజేశ్

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

బాన్సువాడ, మే 27 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమించిన మలిదశ ఉద్యమకారులకు రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని, 250 గజాల స్థలాన్ని ఇవ్వాలని జిల్లా మలిదశ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మలిదశ ఉద్యమకారులు ఆయనను మంగళవారం శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించని యెడల మళ్లీ ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో దేశాయి, గంజివార్ చందు, ఎర్రవట్టి సాయిబాబా, మాజీద్, కాల్వ శ్యామ్, భాస్కర్‌గౌడ్, కృష్ణ, సాయికుమార్, భీమ్‌సింగ్, బసంత్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఉద్యమకారులు

## విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

నాగిరెడ్డిపేట, మే 27 : మండలంలోని తాండూర్ గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సహకారంతో మంగళవారం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా చేసేలా కృషి చేసినట్లు స్థానిక నాయకుడు శ్రీధర్‌గౌడ్ తెలిపారు.


## రిజర్వాయర్ పనులను త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, మే 27 : సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో సంబంధిత శాఖల అధికారులతో నియోజక వర్గ అభివృద్ధి, సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులు, వానకాలం ఆరంభం కావడంతో రైతులకు విత్తనాలుత, ఎరువుల కొరత లేకుండా, నర్సింగ్ కళాశాల నిర్మాణం తదితర అంశాలపై మంగళవారం సమీక్షించారు. నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

## రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



రేపల్లెవాడలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారి రవీందర్

ఎల్లారెడ్డి రూరల్/నాగిరెడ్డిపేట/నిజాంసాగర్, మే 27 : ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ విస్తీర్ణాధికారి రవీందర్ అన్నారు. ఎల్లారెడ్డి మండలం రేపల్లెవాడ గ్రామంలో మంగళవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. ఒక రైతుకు ఎన్ని చోట్ల భూములు ఉన్నా ఒకే గుర్తింపు కార్డు జనరేట్ అవుతుందన్నారు. గుర్తింపు కార్డు ప్రతి రైతుకు తప్పనిసరిగా ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఇది ఉపయోగపడుతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకున్న రైతులు తమతో పాటు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, ఆధార్‌లింకు ఉన్న ఫోన్ నంబర్‌ను తీసుకొని రావాలన్నారు. నాగిరెడ్డిపేట మండలంలో ఇప్పటి వరకు నాలుగు వేల మంది రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు ఏవో సాయి కిరణ్ తెలిపారు. మహ్మద్‌నగర్ మండలం గాలిపూర్ గ్రామ రైతువేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్డులను ఏఈవో రేణుక అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## పంచలోహ విగ్రహం అందజేత

బాన్సువాడ, మే 27 : బాన్సువాడలోని అయ్యప్ప ఆలయానికి బాన్సువాడకు చెందిన రుద్రంగి మురళి కుటుంబ సభ్యులు వారి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పంచలోహ విగ్రహాన్ని అందజేశారు. అయ్యప్ప ఆలయంలోని సుబ్రమణ్య స్వామి గుడికి శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి సుమారు రూ.25 వేల విలువైన పంచలోహ విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అయ్యప్ప ఆలయ మహాపాదయాత్ర గురుస్వామి గురు వినయ్ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి అభినందించారు.